క్లుప్తంగా

ఆనందంగా సాగాలి


దుద్దకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తిటౌన్: నూతన తెలుగు సంవత్సరాది ఉగాది ఆనందంగా సాగాలని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆకాంక్షించారు. వర్షాలు కురవాలని, పాడిపంటలు చేతికందాలని, ప్రజలు సిరిసంపదలు, ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని కోరుకున్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలు కొనసాగించాలని ప్రజలకు సూచించారు.

ఘనంగా గంగమ్మ దేవర

గాండ్లపెంట: నాయనివారిపల్లిలో గంగమ్మ దేవర సోమవారం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ హాజరయ్యారు. ఆయనకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారి చల్లని దీవెనలతో సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండి రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని మక్బూల్ అహ్మద్ కోరుకున్నారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు

ధర్మవరం అర్బన్: పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను కమిషనర్ రామ్‌కుమార్, ఈఈ సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు.

చలివేంద్రం ఏర్పాటు

నల్లచెరువు: ఉబిచర్ల గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి గంగాధర ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు.

ముస్లింలకు సరుకుల పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న ఖిద్మత్ టీం సభ్యులు

ధర్మవరం అర్బన్: రంజాన్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని పీఆర్‌టీ స్ట్రీట్ షాదీ మహల్‌లో 120 ముస్లిం కుటుంబాలకు హజరత్ టిప్పు సుల్తాన్ ఖిద్మత్ టీం సభ్యులు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హజరత్ టిప్పుసుల్తాన్ ఖిద్మత్ టీం సభ్యులు, ముతవల్లులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించండి


ఫ్యానుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న నాయకులు

తలుపుల: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీల్లో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్, హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జ్ డీకే బాబు, పార్టీ మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, సర్పంచ్ దివాన్ వలి, ఎస్టీ సెల్ కుమార్, వార్డు మెంబర్లు మౌలా, రమేష్, శ్రీనాథ్, హరి, ప్రభువర్ధన్, అంజి పాల్గొన్నారు.

అంతటా ఉగాది సందడి


బత్తలపల్లిలో కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న మెయిన్‌రోడ్డు సెంటర్


బత్తలపల్లిలో పండ్లు, పూలు కొంటున్న ప్రజలు

బత్తలపల్లి: తెలుగు వారి తొలి పండుగ ఉగాది. 'ఉగ' అంటే నక్షత్రాల గమనం లేదా సృష్టి అని అర్థం. 'ఆది' అనగా ప్రారంభం అని అర్థం. సృష్టి అరంభం లేదా యుగారంభమే యుగాది. కాలక్రమేణా 'ఉగాది'గా రూపాంతరం చెందింది. ఏటా చైత్రశుక్ల పాఢ్యమి రోజున వచ్చే ఈ పండుగను తెలుగు సంవత్సరాదిగా ప్రతి ఇంటిలో తోరణాలు కట్టి, వేపపూత పచ్చడితో ఆనందోత్సాహాల నడుమ సాదరంగా ఆహ్వానిస్తారు. జీవిత గమనంలో కష్ట సుఖాలను ప్రతిబింబించే షడ్రుచుల సమ్మేళనంతో ఈ పండుగ సరదాగా సాగిపోతుంది. విజయతీరాలు చేరుకోవాలని పచ్చని తోరణాలు, మంగళ వాయిద్యాలతో శోభకృత్ నామ సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ శ్రీక్రోధి నామ సంవత్సరానికి ఆహ్వానం పలికే కార్యక్రమాలు శోభాయమానంగా జరగనున్నాయి. సంప్రదాయబద్ధంగా స్వాగతం పలకడానికి ప్రజలు మామిడి, వేప, బిల్వపత్రి తదితర ఆకుల పచ్చతోరణాలతో ప్రజలు తమ ముంగిళ్లను అందంగా అలంకరించారు. మంగళవారం ఉగాది పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో క్రయవిక్రయాలతో సందడి నెలకొంది. సోమవారం ఆయా ప్రాంతాల్లోని మార్కెట్లు, మెయిన్ బజార్లు కిటకిటలాడాయి. ఇంటి తోరణాల కోసం పూలు, పండ్లు, టెంకాయలు, పూజలకు అవసరమైన వస్తువుల విక్రయాలు జోరుగా సాగాయి.

నేడు పంచాంగ శ్రవణం..

బత్తలపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వేదపండితుల ఆధ్వర్యంలో ఉగాది పండుగను పురస్కరించుకుని మంగళవారం పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా మండలంలోని సంగమేశ్వరక్షేత్రం, ఈదుల ముష్టూరు శివాలయంలో పంచాంగ పఠనం ఉంటుందని అర్చకులు తెలిపారు.

సంక్షేమ రాజ్యం జగనన్నతోనే సాధ్యం


ప్రచారం చేస్తున్న బీఎస్ మక్బూల్ అహ్మద్


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్‌అహ్మద్, నాయకులు

గాండ్లపెంట: పారదర్శక పాలన, ముంగిటకే ప్రభుత్వ సేవలు, సిఫార్సులకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల అమలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సోమవారం మక్బూల్ అహ్మద్ నాయనివారిపల్లిలో గడప గడపకూ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి కదిరి నుంచి పోటీ చేస్తున్న తనను, హిందూపురం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బోయ శాంతమ్మను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రభాస్కర్‌రెడ్డి, సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ గజ్జలరవీంద్రారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కల నరసింహగౌడ్, మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తాలుకా రైతు సంఘం కార్యదర్శి సూర్యనారాయణరెడ్డి, తాలుకా బీసీ సెల్ కార్యదర్శి హుస్సేన్‌పీరా, ట్రేడ్‌యూనియన్ నాయకలు కృష్ణారెడ్డి, మండల యూత్ ఉపాధ్యక్షులు ముజాహిద్, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్లు మేకల నరసింహులు, ఫారూక్, స్థానిక నాయకులు ఉత్తన్న, ఇక్బాల్, శేఖరరెడ్డి, నాగరాజు, రామకృష్ణ, ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి.. అండగా ఉంటా

కదిరి అర్బన్: వైఎస్సార్‌సీపీని ఆదరిస్తే.. ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్‌కు అంగా ఉంటామని ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ తెలిపారు. సోమవారం పట్టణంలోని బటర్ ఫ్లై పాఠశాలలో ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కో కన్వీనర్ జుబేర్ సుల్తాన్ ఆధ్వర్యంలో ప్రైవేట్ ఉపాధ్యాయులు, లెక్చరర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ తాము అధికారంలో వస్తే ప్రైవేట్ టీచర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రపై రాజకీయం తగదు

కదిరి టౌన్: పవిత్ర ఉమ్రా యాత్రకు తాను వెళితే.. దానిని రాజకీయం చేయడం ఏమాత్రమూ తగదని వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ అన్నారు. సోమవారం కదిరి మున్సిపల్ పరిధిలోని 22 వార్డులో కౌన్సిలర్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకూ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. రంజాన్ మాసంలో దైవదర్శనం కోసం ఉమ్రాయాత్రకు వెళ్లడాన్ని రాజకీయాలకు ముడిపెట్టి తప్పుడు కథనాలు ప్రచురించడం.. రాసిన వారి విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి షాకీర్, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షులు కొలిమి జిలాన్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు పరికి సాదిక్ బాషా, లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి

ఎన్పీకుంట: వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, ఉపసర్పంచ్ సామిరెడ్డి ఆధ్వర్యంలో దిగువతూపల్లికి చెందిన ఇద్దరు టీడీపీ కార్యకర్తలు మస్తాన్‌వలి, వెంకటనారాయణ వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం కదిరి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్‌అహ్మద్ సమక్షంలో వీరు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్‌చాంద్‌బాషా, రాష్ట్ర సీఈసీ సభ్యులు పూలశ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్లు సద్వినియోగం చేసుకోండి

పుట్టపర్తి అర్బన్: పోస్టల్ బ్యాలెట్లను ఎన్నికల అధికారులు సద్వినియోగం చేసుకోవాలని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ సూచించారు. సోమవారం నియోజక వర్గంలోని పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాలకు ఉదయం, నల్లమాడ, ఓడీ చెరువు, అమడగూరు మండలాలకు సాయంత్రం సెక్టోరియల్ అధికారులు, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలకు శిక్షణ నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించి పుట్టపర్తి డివిజన్‌ను జిల్లాలో ఉత్తమ డివిజన్‌గా గుర్తింపు తీసుకురావాలన్నారు.

ఓటు హక్కు వినియోగానికి చర్యలు

ధర్మవరం రూరల్: దివ్యాంగులు, 85 ఏళ్ల వయసు పైబడిన వారు సైతం ఓటు హక్కు వినియోగించుకునేలా తగిన చర్యలు చేపట్టామని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వెంకటశివరాంరెడ్డి తెలిపారు. సోమవారం ధర్మవరం మున్సిపల్ కార్యాలయంలో పట్టణ, గ్రామీణ పరిధిలో గల సెక్టార్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్ల పరిధిలో 85 సంవత్సరాలు పైబడిన వారిని, దివ్యాంగులను గుర్తించి 12 డీ దరఖాస్తు పూరించాలన్నారు. అలా దరఖాస్తు చేసుకుంటే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, తహసీల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడలో పోలీసుల కవాతు

నల్లమాడ: మండల కేంద్రం నల్లమాడలో సీఐ రాజేంద్రయాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం కవాతు నిర్వహించారు.

జగనన్నను సీఎం చేసుకుంటాం


రాజీనామా లేఖలతో వలంటీర్లు

కొత్తచెరువు: మండల కేంద్రం కొత్తచెరువులో వలంటీర్లు అంజనేయులు, మణి, చాయాదేవి, ముంతాజ్, సాయిసునీత, రాము, సోమశేఖర్, రమేష్, బాబు, సున్నియాజ్ సహా 40 మంది రాజీనామా చేశారు. తమ రాజీనామా లేఖలను ఎంపీడీఓ సిద్దారెడ్డికి సోమవారం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇక నుంచి జగనన్నను మరోసారి సీఎం చేసుకోవడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అలాగే కొడపగానిపల్లి సచివాలయ పరిధిలోని 19 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. పంచాయతీ కార్యదర్శి గంగాధర్‌రెడ్డికి రాజీనామ లేఖలు అందజేశారు.

20 మంది వలంటీర్ల రాజీనామా

అమడగూరు: మండలంలోని చినగానిపల్లి, కస్సముద్రం, మహమ్మదాబాద్ గ్రామ పంచాయతీల పరిధిలోని 20 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.

దొన్నికోటలో 14 మంది రాజీనామా

నల్లమాడ: దొన్నికోట సచివాలయ పరిధిలో పనిచేస్తున్న 14 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి రాంమోహన్‌కు అందజేశారు. ఇక నుంచి వైఎస్సార్‌సీపీ సైనికుల్లా పనిచేసి పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి విజయానికి తమవంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

98 మంది రాజీనామా

ఓడీచెరువు: మండలంలోని వివిధ పంచాయతీల నుంచి 98 మంది వలంటీర్లు తమ పోస్టులకు రాజీనామా చేశారు. జగనన్నకు తోడుగా ప్రచారం చేయడానికి తామంతా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

అభివృద్ధి సాధకుడు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి


కొండకమర్ల పంచాయతీలో అభిమానుల మధ్య దుద్దుకుంట కిషన్‌రెడ్డి


మిట్టపల్లిలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో కిషన్‌రెడ్డి

- మరోమారు ఎమ్మెల్యేగా గెలిపించండి
- ఓటర్లను కోరిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తనయుడు కిషన్‌రెడ్డి

ఓడీచెరువు: పుట్టపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని ఆయన తనయుడు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అలాంటి అభివృద్ధి సాధకుడు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని మరోమారు ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం ఆయన మిట్టపల్లిలో ఎన్నికల ప్రచారం చేశారు. నేషనల్ హైవేలు, అంతర్గత రహదారులు, నాడు–నేడు కింద సుందరంగా రూపుదిద్దుకున్న మిట్టపల్లి హైస్కూల్ ఇవన్నీ శ్రీధర్‌రెడ్డి కృషితోనే సాధ్యమయ్యాయన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుకే ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రాజునాయుడు, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డి, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, టౌన్ కన్వీనర్ కోళ్ళ కృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనంద్‌రెడ్డి, బూత్ లెవెల్ మేనేజర్ గోవర్దన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షులు రామసుబ్బారెడ్డి, మిట్టపల్లి సర్పంచ్ భర్త మజీద్, సర్పంచ్ జగన్‌మోహన్‌చౌదరి, ఎంపీటీసీ గణేష్‌రెడ్డి, రమణ సీనియర్ నాయకులు హనుమంతరెడ్డి, నరేష్‌రెడ్డి, రఘు, నాగూర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిట్టపల్లికి చెందిన 25 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో డి.వేణుగోపాల్, పి.అమీర్, జి.బాబాయ్య, పెద్ద మహమ్మద్, ఖాన్షుల్లా, అజంతుల్లా, చిన్న నారాయణ, ఖలందర్, మహబూబ్‌బాషా తదితరులు ఉన్నారు.

జగనన్నే మా నమ్మకం

ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన జగనన్నపై నమ్మకంతో తాము వైఎస్సార్‌సీపీలో చేరామని కొండకమర్ల పంచాయతీలోని 60 కుటుంబాల వారు తెలిపారు. సోమవారం వారు టీడీపీని వీడి దుద్దుకుంట కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో రామాంజి, గణేష్, నరసింహులు, కుళ్లాయప్ప, ప్రభాకర్ నాయక్, విష్ణువర్దన్ నాయక్, మహేష్, తలారి శీను, తలారి వెంకటేష, రాజు, జయప్ప, ఆనంద్ నాయక్, చంద్రశేఖర్, రాజు నాయక్, నాగేంద్ర, ప్రసాద్ నాయక్, శ్రీరాములు, పీరునాయక్, మోహన్ నాయక్, మహేష్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ రాజు నాయుడు, మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డి, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనంద్ రెడ్డి, బూత్ లెవెల్ మేనేజర్ గోవర్దన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షులు రామసుబ్బారెడ్డి, సర్పంచు జగన్ మోహన్ చౌదరి, సీనియర్ నాయకులు హనుమంతరెడ్డి, నరేష్‌రెడ్డి, నిస్సార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ మేలును మరవొద్దు


రాశింపల్లిలో దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి ప్రచారం

పుట్టపర్తి: జగన్ పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ జరిగిన మేలును మరవొద్దని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి సూచించారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం మరోమారు వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టాలని కోరారు. బుక్కపట్నం మండలం గూనిపల్లి, రాశింపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని మరోమారు ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, రాశింపల్లి హనుమంతరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గూనిపల్లికి చెందిన కేపీ నాగిరెడ్డి, బూత్ కమిటీ సభ్యుడు మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామిరెడ్డి, గొల్ల లక్ష్మీనారాయణ, రాజేంద్ర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'స్పందించు- సాయం అందించు'కు విరాళాలు

ధర్మవరం రూరల్: ఆర్డీటీ ఆధ్వర్యంలో చేపట్టిన 'స్పందించు – సాయం అందించు' కార్యక్రమానికి మంచి స్పందన వస్తోంది. ఇందులో భాగంగా సాయికృష్ణ రూ.50వేలు, బాయ్స్ టౌన్ స్కూలు యాజమాన్యం రూ.25 వేలు, సర్పంచ్ ముత్యాలప్ప రూ.25 వేలు, సర్పంచ్ సత్యమయ్య రూ.5 వేలు, రేగాటిపల్లి సర్పంచ్ సురేష్‌రెడ్డి రూ.5 వేలు, ఆదినారాయణ రూ.10 వేలు, కాశప్ప రూ.15 వేలు విరాళంగా అందజేశారని ఆర్డీటీ సిబ్బంది సోమవారం తెలిపారు.

మద్యం విక్రేత అరెస్ట్

తలుపుల: మండల కేంద్రంలో మద్యం విక్రేత కొండారెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ సోమవారం తెలిపారు. విక్రేత నుంచి 14 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా మద్యం అమ్మినా, తమ వద్ద ఉంచుకున్నా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వాల్మీకుల ఇంటింటి ప్రచారం

ఓడీచెరువు: మండలంలోని డబురువారిపల్లి, కొండకమర్ల, శేషయ్యగారిపల్లిలో వాల్మీకులు సోమవారం ఇంటింటా తిరిగి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన మహానుభావుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఓటు వేసి రుణం తీర్చుకుందామని పిలుపునిచ్చారు. ప్రచారంలో పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, పాదయాత్ర శంకర్, కొత్తచెరువు వైస్ ఎంపీపీ గంగరాజు, అమడగూరు సొసైటీ అధ్యక్షులు బొట్టుస్వామి, అగ్రహారం సర్పంచు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పొలంలో గోదాముకు నిప్పు

తనకల్లు: పోకనాటపల్లి రైతు వెంకటరమణారెడ్డికి చెందిన పొలంలోని గోదాముకు సోమవారం నిప్పంటుకుంది. అందులో భద్రపరచిన డ్రిప్ పైపులు, ఇతర వ్యవసాయ సామగ్రి గద్దమయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అన్నమయ్య జిల్లా మొలకలచెరువులోని అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. దాదాపు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రలోని సెబ్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అక్రమ మద్యం సరఫరా చేసే మార్గాల్లో రూట్ వాచ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఎస్ సుబ్రహ్మణ్యం, సీఐ లలితాదేవి, ఎస్ఐ శివప్రసాద్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ల ఆవిష్కరణ

బత్తలపల్లి: మండలంలోని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు స్వగృహంలో త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్లను జెడ్పీటీసీ కోటి సుధ ఆవిష్కరించారు.